
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు 5
శుక్రవారం 18 ఏప్రిల్ 2025

మత్తు వదిల్చే ధరలు



జిల్లాలో మద్యం దందా సాగుతోంది. ఎంఆర్‌పీ ధరలకు మించి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. బార్లలో అయితే మరీ దారుణంగా ఎవరికి నచ్చినట్లు వాళ్లు నిలువు దోపిడీ చేస్తున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా బెల్ట్‌షాపుల నిర్వహణ యథేచ్ఛగా సాగుతోంది. మద్యం బాబులకు తాగినా మత్తు ఎక్కని స్థాయిలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని బార్లు, మద్యం దుకాణాలు నిలువు దోపిడీ చేస్తున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

- మద్యం విక్రయాల్లో ఎంఆర్‌పీ కంటే అదనంగా వసూలు
- ఒక్కొక్క బాటిల్‌పై రూ.10 నుంచి 30 వరకు
- బార్‌లో రూ.50 నుంచి 80 వరకు
- ఎక్కడపడితే అక్కడ సిట్టింగ్‌లు, చీర్స్
- గుట్టుగా బెల్ట్‌షాపులు
- కన్నెత్తి చూడని ఎక్సైజ్, పోలీసు అధికారులు

నంద్యాల, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 116 మద్యం దుకాణాలు, కల్లు గీత కార్మికులకు సంబంధించిన దుకాణాలు-11 మొత్తంగా 127 దుకాణాలు, 22 బార్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఉదయం 10నుంచి రాత్రి 10 గంటల వరకు.. బార్లు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటలు వరకు మాత్రమే విక్రయించాలి. ఒక్కొక్కరికి మూడు బాటిళ్ల వరకు ప్రభుత్వం పరిమితం చేసింది. కానీ ఎక్కడా ఈ నిబంధనలు పాటించడం లేదు. సమయం ముగిసిన తర్వాత కూడా మద్యం విక్రయిస్తున్నారు. ఒకవైపు బెల్ట్ షాపులతో అక్రమ మద్యం ఏరులై పారుతోంటే.. మరో వైపు మాత్రం నాటుసారా పడగ విప్పుతోంది. ఇలా.. జిల్లాలో ఎక్కడ పడేతే అక్కడ మద్యం, నాటుసారా విక్రయాలు గుప్పుమంటున్నాయి.



శ్రీనివాస్ సెంటర్ సమీపంలోని మద్యం దుకాణం

ఎంఆర్‌పీ ధరకు మించి...

జిల్లాలో 127 మద్యం దుకాణాలు.. 22 బార్లు ఉన్నాయి. వీటిలో అధికశాతం మద్యం దుకాణాలలో ఎంఆర్‌పీ ధరలకు మించి అదనంగా విక్రయించి మందుబాబుల జేబులకు చిల్లుపెడుతున్నారు. ఏకంగా ఒక్కో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.30, బీర్లపై రూ. 40 అదనంగా వసూళ్లు చేస్తున్నారని తెలిసింది. మద్యం దుకాణాల వద్ద తాగకూడదని నిబంధన ఉన్నా.. నిర్వాహకులు అవేమీ పాటించడం లేదు. దీంతో ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ తాగేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారు. మరికొందరైతే పర్మిట్ రూమ్‌లు పెట్టి మరీ మద్యం తాపిస్తుండటం పలు విమర్శలకు తావిస్తున్నది. ఇందుకు నిదర్శనం గత కొన్ని రోజుల కిందట ఏ1 వైన్స్ దుకాణం వద్ద మద్యం మత్తులో వీరంగం సృష్టించడంతో స్థానిక పోలీసులు రంగ ప్రవేశం చేసి మద్యం ప్రియులను స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా నగరం నడిబొడ్డున శ్రీనివాస్ సెంటర్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద పక్కనే.. జీర్ కర్టన్ దాపున మద్యం తాగడానికి ఏర్పాట్లు చేయడం విస్మయం కలిగిస్తోంది. వీరికి మేమేమీ తీసిపోం అనే విధంగా జిల్లాలో బార్ల నిర్వాహకులు కూడా నిబంధనలు పాటించడం లేదు. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.50 నుంచి రూ. 80 వరకు ధరలు పెంచి మద్యం ప్రియులను దోచుకుంటున్నారు. జిల్లాలో ఉన్న 22 బార్లలో చాలా చోట్ల ఆశించిన స్థాయిలో వసతులు, సౌకర్యాలు లేవు. అయినా మద్యం ధరలు విపరీతంగా పెంచి విక్రయిస్తున్నారు. కొందరు మద్యం ప్రియులు బయట, ఇంట్లో తాగలేక.. బార్‌కు వెళ్తున్నారు. అక్కడ నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. మద్యం, తినుబండారాల ధరలు విపరీతంగా పెంచి విక్రయిస్తున్నారు. అధికారులు సైతం ఆవైపు కన్నెత్తి చూడకపోవడం బార్ల యజమానులకు బాగా కలిసి వచ్చింది.

గుట్టుగా బెల్ట్‌షాపులు...



జిల్లాలో నేటికీ బెల్ట్‌షాపుల వ్యవహారం విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల వద్దకు ఒకరు తరువాత మరొకరు కుటుంబ సభ్యులు, లేదా వారికి కావాల్సిన వారు వచ్చి అధిక సంఖ్యలో మద్యం బాటిళ్లు కొని బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారు. ఎంఆర్‌పీ ధరలకు మించి అదనంగా నగదు చెల్లిస్తే దుకాణాలు, బార్ల నిర్వాహకులు సైతం అక్రమ మద్యం అమ్మకాల రూపంలో క్యాష్ చేసుకుంటున్నారు. దీంతో అధికశాతం విక్రయాలు బెల్ట్‌షాపుల ద్వారా సాగిస్తున్నారని వినికిడి. దీంతో ఎవరికి ఎలాంటి అనుమానం రాకుండా గుట్టుగా బెల్ట్‌షాపుల నిర్వహణ సాగిస్తున్నారని సమాచారం.

కన్నెత్తి చూడని ఎక్సైజ్.. పోలీసులు

జిల్లాలో మద్యం దుకాణాలు, బార్ల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయిస్తున్నా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.. అవసరమైతే దుకాణాలను సీజ్ చేస్తాం.. అని నిత్యం ఆ శాఖ అధికారులు చెప్పే మాటలేవీ ఆచరణలోకి రావడం లేదు. ఆశించిన స్థాయిలో తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాంతాల వారిగా బార్లు, మద్యం దుకాణాల నుంచి అధికారులు మామూళ్లు తీసుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలో ఇంతలా మద్యం దందా సాగుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

తనిఖీలు ముమ్మరం చేసి చర్యలు తీసుకుంటాం



తనిఖీలు ముమ్మరం చేసి నిబంధనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. బెల్ట్‌షాపులు.. నాటుసారా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. నిబంధనలు అతిక్రమంచి విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. సిబ్బందిపై ఆరోపణలు వస్తే.. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్



ఏ1 మద్యం దుకాణం ఇలా..

పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్రతను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజకుమారి వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో ప్రభుత్వ సీఎస్ కె.విజయానంద్ సమావేశమయ్యారు. ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ల ఫిల్లింగ్ యాక్షన్‌ప్లాన్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెల 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19 శనివారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీ సైక్లింగ్‌తో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 1,630 మంది

మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 1,630 మంది యాత్రికులు వెళ్తున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. గురువారం నంద్యాల నేషనల్ పీజీ కళాశాలలో జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్, బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ హజ్ యాత్రికులకు హైదరాబాద్, బెంగుళూరు ఎంబార్కేషన్ సెంటర్ల నుంచి వివిధ దశల్లో హజ్‌కు వెళ్తారన్నారు.

ఉర్దూ భాషపై పోస్టర్ విడుదల : రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ భాష ప్రాముఖ్యతపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఉర్దూ భాష ఒక ప్రాంతం, ఒక వర్గం, ఒక మతానికి చెందినది కాదని.. మనందరి భాష అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మహమ్మద్, గౌసపీర్, రఫీఅహ్మద్, హాఫీజ్ అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఉర్దూ భాష ప్రాముఖ్యత పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి ఫరూక్

ముంపు బాధితులకు స్థలాలు ఇవ్వాలి

పాత సిద్ధేశ్వరంలో ఆందోళన



సిద్దేశ్వరం వద్ద స్థానికేతర ముంపు బాధితులతో మాట్లాడుతున్న ఎస్ఐ జయశేఖర్

కొత్తపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో ఆస్తులు పోగొట్టుకుని ఇతర ప్రాంతాల్లో కాలం వెళ్లదీస్తున్న ముంపు గ్రామాల ప్రజలకు స్థానికంగానే స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని నీటి ముంపు స్థానికేతర నిర్వాసితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలంలోని పాత సిద్ధేశ్వరం గ్రామానికి చెందిన నీటి ముంపు స్థానికేతర నిర్వాసితులు గత 40 ఏళ్ల క్రితం గ్రామాన్ని వదిలి కర్నూలు, మద్దూరు, పెసరవాయి, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, తాండ్రపాడు తదితర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. గురువారం సుమారు 150 మంది స్థానికేతర ముంపు బాధితులు పాత సిద్ధేశ్వరం చేరుకుని తమకు స్థానికంగానే మూడు సెంట్ల స్థలం ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని, ఇక్కడే తమకు రేషన్, ఆధార్, ఓటరు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని పాతసిద్ధేశ్వరం వద్ద వారు ఆందోళనలు చేపట్టారు.

ఫ్రైడే..!



- జిల్లాలో ఠారెత్తిస్తున్న ఎండలు
- గోస్పాడులో అత్యధికంగా 41.71 డిగ్రీల ఉష్ణోగ్రత

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. అధిక ఉష్ణోగ్రతలకు తోడు వడగాల్పులు వీస్తుండటంతో మధ్యాహ్నం వేళల్లో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. గురువారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గోస్పాడు మండలంలో అత్యధికంగా 41.71 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది. మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో 41.5 డిగ్రీలు, సంజామల మండలం పేరుసోములలో 41.47, పాణ్యం మండలం గోనవరంలో 41.22, అవుకులో 41.12, దొర్నిపాడులో 41.1, నందవరంలో 41.04, డోన్‌లో 40.94, చాగలమర్రి మండలం ముత్యాలపాడులో 40.89, పాణ్యం మండలం అనుపూరులో 40.79, శిరివెళ్లలో 40.61, సంజామల మండలం లింగందిన్నెలో 40.59, నంద్యాలలో 40.48 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే కర్నూలు నగరంలో 41.21 డిగ్రీల సెల్సియస్, కోడుమూరులో 40.29, మంత్రాలయంలో 40.09, సి.బెళగల్ 39.79, కల్లూరు 39.55 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నిర్మానుష్యంగా నంద్యాల ఎస్‌బీఐ కాలనీ రహదారి

క్షమా గుణమే క్రీస్తు మార్గం

నేడు గుడ్‌ఫ్రైడే...చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు



నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దయ, క్షమాగుణం మానవ జాతి మనుగడకు ఏకైక మార్గమని ప్రబోధించిన నవయుగ కర్త క్రీస్తు ప్రభువు. సమస్త మానవాళి చేసిన పాపాల ప్రాయశ్చిత్తం కోసం ఆయన శిలువపై ప్రాణాలు అర్పించాడు. తిరిగి మూడో రోజు సమాధి నుంచి లేచాడు. పొరుగువారిని ప్రేమించాలని, వారి తప్పులను క్షమించాలని బోధించాడు. క్రైస్తవ మత విశ్వాసం ప్రకారం యేసుక్రీస్తు శుక్రవారం శిలువ వేయబడ్డారు. ఆ రోజును గుడ్ ఫ్రైడే జరుపుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులు 'గుడ్‌ఫ్రై డే' వేడుకను నిర్వహించుకోడానికి సిద్ధమయ్యారు. దయామయుని తలుస్తూ ఉపవాసం, ప్రార్థనలతో గడుపనున్నారు. ఈ సందర్భంగా అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. మత పెద్దలు గుడ్‌ఫ్రై డే సందేశాన్ని అందించనున్నారు.

నగరంలో గుడ్ ఫ్రై డే ప్రార్థనలు...

కర్నూలు నగరంలోని సీఎస్ఐ చర్చి, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, రాక్‌వుడ్ చర్చిలతోపాటు నంద్యాల, ఆత్మకూరు, డోన్, నందికొట్కూరు, బనగానపల్లె తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రై డే ప్రార్థనలు నిర్వహిస్తారు.

పవిత్ర దినం

యేసుక్రీస్తును శిలువ వేసిన జ్ఞాపకార్థంగా గుడ్‌ఫ్రై డే రోజున అందరూ చర్చీలకు వెళ్తారు. పాస్టర్లు సందేశాలు అందిస్తారు. యేసు త్యాగం కారణంగా ప్రజలు విముక్తి పొందారని, మరణం తర్వాత స్వర్గానికి చేరుకోవచ్చని భక్తులు నమ్ముతారు. యేసుక్రీస్తు మానవుల పాప పరిహారార్థమే శిలువను మోశారు. మానవులు చేసిన అన్ని పాపాలకు ఆయన త్యాగం, క్షమాగుణమే సమాధానంగా నిలుస్తుంది. క్షమ ఆయన జీవన సందేశం.

పెనుగాలుల బీభత్సం


- పది ఎకరాల్లో దెబ్బతిన్న అరటి
- రూ.20 లక్షల నష్టం



ప్యాపిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్‌పల్లి గ్రామంలో గురువారం రాత్రి పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈ గాలులకు 10 ఎకరాల్లో అరటి తోట నేలవాలింది. రూ.20లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ప్రేమసాగర్‌రెడ్డి తెలిపారు. ఎకరాకు రూ. లక్ష పెట్టుబడులు పెట్టి పంట సాగుచేశాడు. ఆరుగాలం కష్టపడి పంటను కాపాడుకున్నాడు. ప్రస్తుతం కాయలు కోతదశలో ఉన్నాయి. కాయలు మార్కెట్‌కు తరలిస్తే రూ.20లక్షలు ధర పలికేవని అతడు చెప్పారు. బలంగా వీచిన పెనుగాలులు నట్టేట ముంచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

ప్యాపిలి మండలంలోని పీఆర్‌పల్లిలో నేల వాలిన అరటి తోట

నకిలీ హాజరు...!



- ముఖ హాజరులో అక్రమాలు
- కర్నూలు జిల్లాలో ఏడుగురికి నోటీసులు

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో సమయపాలన కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన ముఖ హాజరు గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) అభాసుపాల వుతోంది. ప్రభుత్వ వైద్య శాలల్లో పనిచేస్తే వైద్యాధికారులు ఐఫోన్ ద్వారా ముఖ హాజరును ట్యాంపరింగ్ చేసినట్లు నిర్ధారణ జరిగింది. కర్నూలు జిల్లాలోని కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్లలో, పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు కొందరు ఐఫోన్ ద్వారా ముఖ హాజరును ట్యాంపరింగ్ చేసినట్లు వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఐదు రోజుల క్రితం జిల్లాలోని ఏడుగురు వైద్యసిబ్బంది ఐఫోన్‌తో ట్యాంపరింగ్ చేసి ఎఫ్ఆర్ఎస్ వేసినట్లు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి వారిపై నిఘా ఉంచిన వైద్యశాఖ ఉన్నతాధికారులు కర్నూలు జిల్లాలో ఏడుగురు ఉద్యోగులను గుర్తించారు.

ఎప్పుడొచ్చినా అదే సమయం..!

ఓ ఉద్యోగి ఉదయం 9:30 గంటలకు వైద్యశాలకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఆ ఉద్యోగి ఉద యం 11 గంటలకు వెళ్లి ఐఫోన్‌లో టైమింగ్ సెట్టింగ్ ద్వారా ముఖ హాజరు వేసినా ఉదయం 9:30 గంటలకు హాజరైనట్లు నమోదవుతుంది. ఈ విషయాన్ని వైద్యఆరోగ్య శాఖలో ఉన్నతాధికారులు సాంకేతిక పరిజ్ఞానం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గుర్తించారు. కర్నూలు జిల్లా నన్నూరు పీహెచ్‌సీలో ఓ స్టాఫ్ నర్సు రెండుసార్లు, పత్తికొండలో ఓ డాక్టర్ ఒకసారి, ఎర్రబురుజు అర్బన్ హెల్త్ సెంటరులో ఓ మెడికల్ ఆఫీసర్, ఓ ఫార్మాసిస్టు గ్రేడ్-2, బండిమెట్ట అర్బన్ హెల్త్ సెంటరులో స్టాఫ్ నర్సు ఒక్కోసారి ఐఫోన్‌లో ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. పుచ్చకాయమడ పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు 3 సార్లు ఐఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ వేయడం గమనార్హం. ఐఫోన్‌లో ట్యాంపరింగ్ చేసిన ఎఫ్ఆర్ఎస్ వేసిన ముగ్గురు మెడికల్ ఆఫీసర్ల వివ రాలు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు, ముగ్గురు స్టాఫ్ నర్సుల వివరా లు కడప ఆర్‌డీకి, ఫార్మాసిస్టు వివరాలు డీఎంహెచ్ఓకు పంపించారు.

కర్నూలు చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి 7

నిమ్మసాగు లాభసాటి
- ఎండలు పెరిగేకొద్దీ ధరలు
- మే నెలలో మరింత పెరిగే అవకాశం
- ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.4 వేలు 6

నిమ్మసాగు లాభసాటి





మల్లేవేములలో నిమ్మకాయలు కోస్తున్న కూలీలు

- ఎండలు పెరిగేకొద్దీ ధరలు
- మే నెలలో మరింత పెరిగే అవకాశం
- ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.4 వేలు

చాగలమర్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిమ్మకాయలకు డిమాండ్ ఉంటుంది. ప్రజలు నిమ్మరసం ఇష్టంగా తాగుతారు. షర్బత్, మజ్జిగ మొదలైన వాటిల్లో నిమ్మకాయలు ఉపయోగిస్తారు. నిమ్మలో ఎక్కువగా సి విటమిన్ ఎక్కువగా ఉండటం వల్ల వినియోగం ఎక్కువే. ప్రస్తుతం 40 కిలోల నిమ్మకాయల బస్తా రూ.2,500 నుంచి రూ4 వేలు నుంచి రూ.4,500 పలుకుతోంది. దిగుబడి తక్కువగా ఉన్నా ధరలు ఉండటంతో రైతులకు లాభసాటిగా ఉంది. నంద్యాల జిల్లాలో 597 హెక్టార్లలో నిమ్మసాగు చేశారు. ఆళ్లగడ్డ మండలంలో 11 ఎకరాలు, చాగలమర్రి మండలంలో 130 ఎకరాలు, రుద్రవరంలో 20 ఎకరాలు, శిరివెళ్లలో 10 ఎకరాలు, దొర్నిపాడులో 5 ఎకరాలు నిమ్మ సాగు చేశారు. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి నిమ్మ తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బోరుబావుల వద్ద మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. గత ఏడాది వరకు నిమ్మకాయలను వ్యాపారులు ప్రతి రోజు 300 బస్తాలను కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కడప, అనంతపురం, చిత్తూరు తదితర నగరాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం దిగుబడి తగ్గిపోవడంతో రోజు కేవలం 50 బస్తాలు మాత్రమే వస్తున్నాయి. ధరలు ఉన్న కాయలు సరిగా లేవని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.250 నుంచి రూ.300 వరకు మాత్రమే ఉన్న ఈ ధరలు ఈనెలలు అమాంతంగా పెరిగాయి. ధరలు పెరగడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు అయితే పొలాలను కౌలుకు తీసుకున్నారు. నెల క్రితం ధర లేక డీలా పడ్డ నిమ్మరైతులు ఇప్పుడు కాలం కలిసొచ్చిందని ఉన్న కాయలను కోసి విక్రయిస్తున్నారు.

రెండు కాయలు రూ.10

గ్రామాల్లో పలువురు చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై నిమ్మకాయలను విక్రయిస్తున్నారు. కాయలు లావుగా ఉంటే రెండు నిమ్మకాయలను రూ.10 వరకు విక్రయిస్తున్నారు. తోటల వద్దకు వెళ్లి రైతుల దగ్గర కొని విక్రయిస్తున్నారు.



చాగలమర్రిలో నిమ్మకాయలు విక్రయిస్తున్న మహిళ

ఈ మూడు నెలలే కీలకం

నిమ్మకాయల విక్రయానికి ఏడాదిలో మూడు నెలలే కీలకమని రైతులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పంటకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో నిమ్మకాయల ధరలకు రెక్కలు వస్తాయని రైతులు తెలిపారు. ఏడాది పొడవునా పంట దిగుబడి వచ్చినా ఆశించిన ధరలు ఉండవు. వేసవి ప్రారంభం కావడంతోనే ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది జనవరిలో ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.600 ఉండగా ఫిబ్రవరి వచ్చేసరికి ఏకంగా రూ.15,00కు పెరిగింది. మార్చిలో రూ.2,500 చేరుకుంది. ప్రస్తుతం రూ.4 వేలు నుంచి రూ.4,500 వరకు ధర ఉంటోంది. మే నెలలో మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 100 చెట్లు సాగు చేస్తే దిగుబడి 100 నుంచి 150 ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తుంది. సాధారణంగా ప్యాకెట్‌కు సైజును బట్టి 800 నుంచి 1,200 నిమ్మకాయలను లోడ్ చేస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలో పండే నిమ్మకాయలు నాణ్యతగా ఉండటంతో ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఈ ప్రాంతంలో పండిన నిమ్మకాయలను బెంగుళూరు, గోవా, ముంబాయి, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ధరలు ఆశాజనకంగా ఉన్నాయి



నిమ్మకాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మల్లేవేముల గ్రామంలో రెండున్నర ఎకరా నిమ్మతోటను కౌలుకు తీసుకొని నిమ్మసాగు చేస్తున్నా. ధరలు బాగున్నా కాయలు పలుచగా ఉన్నాయి. కోత కోసిన కాయలను చాగలమర్రి నుంచి ముంబాయికి ఎగుమతి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉంది. శ్రీను, కౌలు రైతు



పొలంలో కుప్పగా పోసిన నిమ్మకాయలు

పొలాలపై డ్రోన్లు

ఉమ్మడి జిల్లాకు 80 కేటాయింపు



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతుల పంట పొలాలపై డ్రోన్లు జుమ్ జుమ్ అంటూ ఎగరనున్నాయి. ఇప్పటిదాకా రైతులు ఎరువులు, మందులు చల్లే పనులు కూలీలతో చేయించేవారు. ఇకపై ఈ పని డ్రోన్లు చేయనున్నాయి. ఇందు కోసం ఉమ్మడి జిల్లాకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు 80డ్రోన్లను మంజూరు చేశారు. వీటిని సప్లయ్ చేసేందుకు విహంగ, డ్రోగో కంపెనీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలుగా నిర్ణయించారు. ఈ డ్రోన్ల మంజూరుకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీని అందిస్తుంది. మిగిలిన మొత్తాన్ని రైతులు కొంత పెట్టుకుంటే, బ్యాంకులు మరికొంత మొత్తాన్ని రుణంగా అందిస్తాయి. గ్రామాల్లో రైతు సంఘాలకు వీటిని అందజేస్తారు. ఒక్కో సంఘంలో ఐదుగురు సభ్యులు ఉంటారని, ఇప్పటికే సంఘాలు ఎంపిక చేసిన వారికి డ్రోన్ల వాడకం గురించి పైలట్ శిక్షణ ఇచ్చామని, ఖరీఫ్ పంట కాలానికి ఇవి రైతులకు అందుబాటులోకి వస్తాయని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ బదిలీ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మిదేవిని బదిలీ చేస్తూ గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె అమరావతిలోని రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. అయితే ఈమె స్థానంలో కర్నూలు జిల్లాకు ఎవరిని ఇంకా నియమించలేదు.

టైప్ రైటింగ్ పరీక్షల్లో స్టేట్ 3వ ర్యాక్



జోయల్ సందీప్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సాయి టైప్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థి జోయల్ సందీప్ టైప్ రైటింగ్ పరీక్షలో రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు గతేడాది సెప్టెంబర్‌లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించిందన్నారు. రెండు రోజుల క్రితం ఫలితాలు విడుదల కాగా జూనియర్ గ్రేడ్ టైప్ రైటింగ్ విభాగంలో సందీప్ మూడో ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు.

కీబోర్డ్ ప్రదర్శనలో గిన్నీస్ రికార్డు



సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థి ఐజక్ న్యూటన్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కిడ్డీస్ రూట్స్ గ్లోబల్ స్కూల్ ఐదో తరగతి విద్యార్థి ఐజక్ న్యూటన్ గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నాడు. ఈనెల 14న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హల్లెల్ సంగీత వ్యవస్థాపకుడు ఆగస్టీన్ చేతుల మీదుగా తమ కుమారుడు గిన్నిస్ వరల్డ్ సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు తల్లిదండ్రులు సుధాకర్, సురేఖ తెలిపారు. హల్లెల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో 1,046 మంది ఒకే సమయంలో కీబోర్డ్ వాయించడంలో రికార్డు నెలకొల్పారన్నారు. డైరెక్టర్లు కేశవ నారాయ ణరెడ్డి, చిన్నపరెడ్డి అభినందనలు తెలిపారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం

'కందుకూరి' పురస్కార గ్రహీతలను సత్కరించిన టీజీ వెంకటేశ్



కందుకూరి విశిష్ట పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కళలను బ్రతికించుకునే క్రమంలో కళాకారులకు టీజీవీ కళాక్షేత్రం తరఫున అన్నివిధాలుగా ప్రోత్సాహకాలు కల్పిస్తామని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ వెల్లడించారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు అందుకున్న కళాకారులను ఐదుగురు కళాకారులను టీజీ వెంకటేశ్ గురువారం ఘనంగా సత్కరించారు. మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఉగాది పురస్కారాలు, కందుకూరి విశిష్ట పురస్కారాలు టీజీవీ కళాక్షేత్రానికి లభించడం సంతోషదాయకమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాస్థాయిలో ప్రకటించిన ఐదు పురస్కారాలన్నీ టీజీవీ కళాక్షేత్రానికే రావడం విశేషమని కొనియాడారు. అవార్డులు సాధించడానికి కళాకారులకు టీజీవీ కళాక్షేత్రం ద్వారా తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. కందుకూరి విశిష్ట పురస్కార గ్రహీతలు రిటైర్డ్ హెచ్‌ఎం ప్యాలకుర్తి ఎర్రమ పాండురంగయ్య, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, ఎం.ఆర్.రాధిక, వనారస మంజులను టీజీ వెంకటేశ్ అభినందించి, శాలువాతో సత్కరించారు. అదేవిధంగా టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 20 నుంచి జరిగే నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వారోత్సవ సాంస్కృతిక కార్యక్రమాల్లో వీరిని విశేషంగా సత్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియా, రంగస్థల నటులు పి.రాజారత్నం, కేవీ రమణ, తబలిస్ట్ మహేష్ పాల్గొన్నారు.

భూమి సారానికి సూక్ష్మ పోషకాలు

ఉచితంగా అందించాలని ప్రభుత్వ నిర్ణయం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 9 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతున్నాయి. అదే విధంగా ఉద్యానపంటలు లక్షన్నర హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం భూమిసారాన్ని పెంచేందుకు సూక్ష్మ పోషకాలను ఉచితంగా అందించింది. ఆ తర్వాత 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని పూర్తిగా ఎత్తివేసింది. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించడానికి సిద్ధపడింది. ఇందులో భాగంగా ఉచితంగా సూక్ష్మ పోషకాలను అందిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు హామీ ఇచ్చారు. ఎన్ని మెట్రిక్ టన్నులు కావాల్సిందీ క్షేత్ర స్థాయి నుంచి సమాచారాన్ని సేకరించి ప్రతిపాదనలు పంపాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. పొలంలో సారాన్ని పెంచేందుకు జింక్-21 శాతం, 800 మెట్రిక్ టన్నులు జింక్-12 శాతం, పది టన్నులు బొరాక్స్ 10.5 శాతం 100 టన్నులు, బోరాక్స్ 20 శాతం 25 టన్నులు, జిప్సం 15వేల టన్నులు ఉమ్మడి జిల్లాలోని రైతులకు అందించేందుకు ఆయా జిల్లాల జేడీలు ప్రభుత్వానికి ఇటీవల ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల పొలాల్లో ఏయే ఎరువులు ఎంత శాతం తక్కువగా ఉన్నాయో తెలుసుకునేందుకు మట్టి పరీక్షల నమూనాలను సేకరించడం ప్రారంభించారు. భూసార పరీక్ష కేంద్రాల్లో విశ్లేషణ ప్రక్రియ పూర్తి చేసి ఫలితాల పత్రాలను ముద్రించారు. ఏ రైతు పొలంలో ఏ రకం పోషకం లోపం ఎంత ఉన్నదీ వెలుగులోకి వచ్చింది.. నివారణకు ఏయే పంటకు ఎంత మోతాదులో పోషకాలు వాడాలనే సమాచారాన్ని కార్డుల్లో ముద్రిస్తున్నారు. భూసార పరీక్షల ఫలితాలు రైతులకు అందించే ప్రక్రియ మొదలైంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భూసార పరీక్షలను పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ పోషకాలను 50,75,100 శాతం రాయితీపై అందజేశారు. ఈసారి కూడా ఇదే విధానం అనుసరించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. వచ్చే ఖరీఫ్‌లో సాగు చేయనున్న పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, వరి, ఆముదం, కంది తదితర పంటలు సాగు చేసే రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 3వేల మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషకాలను తెప్పించాలని ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. నత్రజని, ఫాస్పరం, పొటాష్ ప్రధాన ఎరువులు పైరుకు బాగా అందాలంటే జింకు సల్ఫేట్, పొటాస్, జిప్సం, మెగ్నీషియం, మాంగనీస్ రకాలు కీలకమని, వీటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.



క్రీడలతో మానసికోల్లాసం

- డీఐజీ కోయ ప్రవీణ్
- క్రికెట్ ఆడి ఉత్సాహపరిచిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



బ్యాటింగ్ చేసేందుకు వెళ్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. గురువారం ఏపీఎస్పీ రెండో బెటాలియన్ మైదానంలో ఏపీఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ పోలీసులకు, సివిల్, ఏఆర్ పోలీసులకు, పోలీసు జట్ల మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌ను డీఐజీతో పాటు ఎస్పీ విక్రాంత్ పాటిల్ కలిసి ప్రారంభించారు. ఈ పోటీలకు కర్నూలు జిల్లా సివిల్, ఏఆర్ పోలీసుల జట్లకు కెప్టెన్‌గా కర్నూలు రేంజ్ డీఐజీ వ్యవహరించారు. ఏపీఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ పోలీసుల జట్టుకు కెప్టెన్‌గా జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ వ్యవహ రించారు. క్రికెట్ మ్యాచ్‌లో జిల్లా ఎస్పీ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. ఇరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీసుల విధి నిర్వహణ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు క్రీడలు ఎంతో దోహద పడుతాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం విధుల్లో ఉండే సిబ్బందికి క్రీడలు నూతనోత్సాహాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అడిషినల్ కమాండెంట్ నాగేంద్రరావు, డీఎస్పీ బాబు ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ఎం బాషా, సుధాకర్ రెడ్డి, రవికిరణ్, వెంకటరమణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ, ఎస్డీఆర్ఎఫ్ పోలీసులు ఉన్నారు.






బ్యాటింగ్ చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

నేడు గోదా గోకుల క్షేత్రంలో రఘునాథాచార్య శత జయంతి వేడుకలు

2 వేల మందితో సామూహిక విష్ణు పారాయణం



మాట్లాడుతున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులోని మామిదాలపాడులో కొలువైన గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో శుక్రవారం రఘునాథాచార్య శత జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన జీయర్ స్వామీజీలతో ఉభయ వేదాంత పండిత సభ, సుమారు 2 వేలకు పైగా భక్తులతో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం గోకుల క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివిధా ప్రాంతాలకు చెందిన జీయర్ స్వామీజీలతో కలిసి ఆయన కార్యక్రమ విశేషాలను వెల్లడించారు. నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు ఈ శతాబ్దానికే గొప్ప శాస్త్ర పండితులని, ఆయన వేదాలను సుళువైన తెలుగులో అందరికీ అర్థమయ్యేలా వ్యాఖ్యానాలు రాశారని అన్నారు. రామాయణ మహాకావ్యంలోని 24వేల శ్లోకాలను కంఠతాపట్టిన వ్యక్తి అని కొనియాడారు. అలాగే త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ సహా ఎందరో జీయర్ స్వామీజీలకు ఆయన గురువుగా బోధన చేశారని, అలాంటి తమ గురువు, మహా మహోపాధ్యాయుని జయంతిని కర్నూలులో నిర్వహించుకోవడం పూర్వజన్మ సుకృతమని చెప్పారు. గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త మాట్లాడుతూ సంపత్కుమార జీయర్ స్వామి నేతృత్వంలో ఈనెల 13 నుంచి గోకులం శ్రీరామాయణ మహాయజ్ఞం కొనసాగుతోందన్నారు.

కర్నూలు చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

- ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం
- నేడు ఓర్వకల్లు, అహోబిలంలో పర్యటన



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఎంపీలు నాగరాజు, శబరి, ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు/ఆళ్లగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం కర్నూలుకు చేరుకున్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మంత్రి ప్రహ్లాదజోషికి ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆర్డీఓ సందీప్ కుమార్, గ్రీన్‌కో ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కర్నూలులోని మౌర్యఇన్ హోటల్‌కు చేరుకున్న మంత్రి రాత్రి అక్కడే బస చేశారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఓర్వకల్లు మండలం గుమితంతండా, పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య గ్రీన్‌కో గ్రూప్ 2800 ఎకరాల్లో, 5,230 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఇంధన పునరుత్పాదక ప్రాజెక్టు ఇది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.10వేల కోట్లకు పైగా గ్రీన్‌కో సంస్థ ఖర్చు చేసింది. రెండో విడత రూ.14వేల కోట్లను ఖర్చు పెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు గ్రీన్‌కో సంస్థ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి శుక్రవారం ఈ ప్రాజెక్టును సందర్శిస్తారు. అనంతరం అహోబిలం చేరుకుని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. ఈ మేరకు రెండు జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి జడ్పీ పాఠశాలలో హెలీప్యాడ్, తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పుణ్యస్నానానికి వెళ్లి అనంత లోకాలకు..

- తుంగభద్ర నదిలో స్నేహితుల మృతి

మంత్రాలయం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చి ఇద్దరు యువకులు తుంగభద్ర నదిలో మునిగి మృతి చెందిన ఘటన ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన బిచ్చాలలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలివి.. బెంగళూరులోని దేవనహల్లి గ్రామానికి చెందిన ముత్తురాజు (24), మదన్ (20) అనే యువకులతో పాటు 13 మంది మంత్రాలయానికి ఓ వాహనంలో వచ్చారు. ఉదయం రాఘవేంద్ర స్వామిని దర్శించకుని కర్ణాటకలోని బిచ్చాల బృందావనాన్ని అప్పన్నాచారి స్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. వాహనాన్ని తుంగభద్ర నది ఒడ్డున నిలిపివేసి స్నేహితులతో కలిసి నదిలోకి దిగారు. ముత్తురాజు నదిలోకి దిగుతుండగానే కాలుజారీ నీటి మడుగులో పడిపోయాడు. స్నేహితున్ని రక్షించబోయి మదన్ కూడా నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కర్ణాటకలోని ఏరిగేరి ఎస్ఐ అరుణ్ కుమార్ రాథోడ్ ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గంటల తర్వాత ముత్తురాజు మృతదేహం లభ్యం కాగా, మరో గంట పాటు పుట్టీలతో, గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టడంతో మదన్ మృతదేహం లభ్యమైంది. తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ముత్తురాజు ఓ హోటల్‌లో పని చేసేవాడు. మదన్ డిగ్రీ వరకు చదివి ఉద్యోగం ప్రయత్నం చేస్తుండేవాడు. ఎరిగేరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్ కుమార్ రాథోడ్ మృతదేహాలను రాయచూరు ఆసుపత్రికి తరించి అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరు పెట్రోలు బంకు వద్ద గురువారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. వివరాలివీ.. వెల్దుర్తి మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన వడ్డె వెంకటరమణ కుటుంబంతో కలిసి గుంటూరుకు వలస వెళ్లి ఇటీవలే స్వగ్రామానికి వచ్చారు. భార్య పుట్టినిల్లు గోనెగండ్ల మండలం పెద్దనేల టూరుకు గ్రామానికి కుటుంబమంతా వెళ్లారు. గురువారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో భార్య, కూతురును ఆటోలో ఎక్కించి, కుమారులు అరవింద్, వేణుకుమార్‌తో కలిసి వెంకటరమణ బైక్‌పై బయలుదేరారు. అయితే వర్కూరు వద్ద పెట్రోలు కోసం బైక్‌ను బంకువైపు మళ్లిస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ బైక్ ఢీకొట్టింది. దీంతో తండ్రి, కొడుకు లిద్దరూ కిందపడి గాయాలపాలయ్యారు. అలాగే వెనుక బైక్‌పై ఉన్న కౌతాళం మండలంలోని బదినేహాల్‌కు చెందిన షేక్షావలి, దాదాపీర్‌కు గాయాల య్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే తీవ్రగాయాలపాలైన వడ్డె వెంకటరమణ (45) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో కోలుకోలేక మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్..

ప్యాపిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్రప్రసాద్(23) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బనగానపల్లి నుంచి గుత్తికి వరిగడ్డి లోడుతో ట్రాక్టర్ బయలు దేరింది. మార్గమధ్యలోని పోతుదొడ్డి సమీపంలోకి రాగానే వెనుకవైపు నుంచి అతివేగంతో వస్తున్న లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నాగేంద్రప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నాగేంద్ర బనగానపల్లి మండలంలోని సాదుకొట్టం గ్రామానికి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



వెంకటేష్ (ఫైల్)

గోనెగండ్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామానికి చెందిన బోయ కండ్ల వెంకటేష్(70) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలివి.. వెంకటేష్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగించేవారు. అయితే ఆరేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడు తున్నారు. దీంతో మద్యానికి బానిసయ్యారు. వ్యాధులు నయం కాకపోడంతో ఈనెల 15న రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో పురుగుల మందు తాగాడు. రాత్రి వాంతులు చేసుకుంటుండగా కుటుంబసభ్యులు 16వ తేది తెల్లవారుజామున ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25న గురుకుల పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి గురుకుల రెసిడెన్సియల్ ప్రవేశ పరీక్షను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఏపీఆర్‌సెట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఉమా మహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. గురుకుల విద్యాసంస్థ అభ్యర్థుల హాల్ టికెట్‌ను https://aprs.apcfss.in/ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

పశువులకు 'సూపర్' వైద్యం



కర్నూలులోని పశువుల ఆసుపత్రి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో 2017 సంవత్సరంలో జనవరి 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5.40 కోట్లతో నాలుగు అంతస్థుల భవనాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు రైతులు తమ జీవాలకు అధునాతన చికిత్స ఇక్కడ చేయిస్తున్నారు. కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు సమీపంలో మూగజీవాలకు అత్యున్నతమైన చికిత్సను అందించేందు కోసం టీడీపీ ప్రభుత్వం నాలుగు అంతస్థుల భవనాన్ని అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసింది. ఈ ఆసుపత్రిలో ప్రతిరోజు 100 నుంచి 150 దాకా పశువులు, గొర్రెలు, మేకలు, పెంపుడు జంతువులకు డాక్టర్లు చికిత్సను అందిస్తున్నారు. ఈ ఆసుపత్రిలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఎక్స్‌రే ప్లాంటును ఏర్పాటు చేయడం ఈ ప్రాంత రైతుల అదృష్టమనే చెప్పాలి. పశువులకు, ఇతర జీవాలకు ఇక్కడ అధునాతన వైద్యం అందిస్తున్నారు. మందుల కొరత లేకుండా, రూపాయి ఖర్చు లేకుండా డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. రోజూ పెంపుడు జంతువులు, కోడెద్దులు, గొర్రెలు, మేకలు, తదితర జీవాలతో ఈ హాస్పిటల్ ఎంతో కళకళలాడుతుండటం విశేషం. ప్రతి రోజు పెంపుడు కుక్కలకు ర్యాబిస్ నివారణకు ఖరీదైన వ్యాక్సిన్లు వినియోగిస్తున్నారు. ఈ హాస్పిటల్‌లో ఒక డిప్యూటీ డైరెక్టర్ స్థాయి కలిగిన వైద్యుడితో పాటు మరో ఇద్దరు అడిషనల్ డైరెక్టర్లు ఐదుగురు డాక్టర్లు ఇతర సిబ్బంది మరో 50 మంది ఉన్నారు. కోళ్లకు వారానికి ఒకసారి ఉచితంగా టీకాలను అందిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 3.62 లక్షల ఆవులు, 14.08 లక్షల మేకలు, గొర్రెలు, 5.85 లక్షల కోళ్లు, మరో 20వేల దాకా ఇతర పశుసంపద ఉన్నట్లు డాక్టర్లు చెబుతు న్నారు. నంద్యాల జిల్లాలో 4.14 లక్షల ఆవులు, 11.89 లక్షల మేకలు, గొర్రెలు, 7.05 లక్షల కోళ్లు, ఉన్నాయి. వీటికి ఈ హాస్పిటల్‌లో వైద్యాన్ని అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.



ఈ ఫొటోలో కోడెద్దుకు కాళ్లువాచాయి. తెలంగాణ రాష్ట్రంలోని అలంపూరు నియోజకవర్గం కంచుపాడు గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి అనే రైతుకు సంబంధించిన ఎద్దు ఇది. ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన కర్నూలు నగరంలోని వెటర్నరీ పాలీ హాస్పిటల్‌కు రైతు తన ఎద్దును తీసుకువచ్చాడు. గతంలో రాతిదూలం లాగుడు పందేల్లో అనేక విజయాలు సాధించిన ఎద్దు అనారోగ్యానికి గురైందని, వైద్యం కోసం ఇక్కడికి తీసుకొచ్చానని అన్నాడు. ఈ రైతు ఒక్కడే కాదు. కర్నూలు, నంద్యాల జిల్లాలో వేలాది మంది రైతులకు నగరంలోని పాలీ క్లినిక్ హాస్పిటల్ ఆధారమైంది.

సూపర్ స్పెషాలిటీ సేవలు

రాష్ట్రంలోనే ఉత్తమ వెటర్నరీ పాలి క్లినిక్ హాస్పిటల్‌గా కర్నూలు నగరంలోని మూగ జీవాల కోసం ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడ ప్రతిరోజు 100 నుంచి 150 మూగజీవాలకు వైద్యాన్ని అందిస్తూ రైతుల నుంచి ప్రశంసలు అందుకోవడంతో డాక్టర్లు, సిబ్బంది సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

- 5.40 కోట్లతో నాలుగంతుస్తుల భవనం
- 2017 జనవరి 2న టీడీపీ హయాంలో ప్రారంభం
- నేటి వరకు వేల సంఖ్యలో వైద్యచికిత్సలు

రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి



కర్నూలు నగరంలోని ఈ హాస్పెటల్‌లో 24 గంటలు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. మూగజీవాలకు ఎలాంటి అనారోగ్యం సంభవించినా ఇక్కడికి వస్తున్నారు. పక్క రాష్ట్రాల నుంచి కూడా పశువులను ఇక్కడకు చికిత్స కోసం తీసుకువస్తు న్నారు. ఈ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్‌గా పశువులకు సేవలందిం చేందుకు కొన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. డ్రైనేజీ తదితర ప్రత్యేక నిర్మాణాలు చేపట్టాల్సి వుంది. - **డా. హేమంత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్**



పదేళ్ల నుంచి ఇక్కడే చికిత్స

దాదాపు 10 సంవత్సరాలుగా ఈ హాస్పిటల్‌లోనే మా పెంపుడు జంతువు కుక్కకు వైద్యచికిత్సను తీసుకుంటున్నాం. దాదాపు 5 కి.మీల దూరంలో ఉన్న శిల్పటౌన్‌షిప్ కాలనీ నుంచి ఇక్కడకు వైద్యచికిత్స కోసం వస్తున్నాం. డాక్టర్లు ఎంతో శ్రద్ధ తీసుకుం టున్నారు.
- కులదీప్, శిల్ప టౌన్‌షిప్, కర్నూలు.

పేద విద్యార్థుల నుంచి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో 25 శాతం కోటా సీట్ల ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి గాను ఉచిత విద్యను అందించే అన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు తమ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్ సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐబీ, సీబీఎస్ఈ, సిలబస్ పాఠశాలలో ప్రవేశాల కోసం ఏడాది 1.4.2025 నాటికి 5 సంవత్సరాల వయసు (సెంట్రల్ సిలబస్), రాష్ట్ర సిలబస్ కోసం ప్రవేశాలకు జూన్ 1వ తేదీ నాటికి 5 సంవత్సరాలు నిండిన పిల్లలు దరఖాస్తు చేసుకునటకు అర్హులు అన్నారు.

ప్రస్తుతం చిరునామా ధృవీకరణ కోసం తల్లిదండ్రులు ఆధార్, రేషన్ కార్డు, ఓటరు కార్డు, భూమి హక్కుల పత్రం, జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సుతో పాటు జనన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు సమర్పించాలన్నారు. సచివాలయాల డేటా ఆధారంగా మే 15 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థులు ప్రవేశానికి అర్హతలు స్టేట్ ప్రాజెక్టు ఎస్పీడీ నిర్ణయిస్తారన్నారు. లాటరీ ద్వారా మొదటి విడత ఫలితాలను మే 21 నుంచి 24 తేదీల మధ్య విడుదల చేస్తారన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ప్రవేశాల నిర్ధారణ జూన్ 2న చేస్తారు. రెండో విడత ఫలితాలను జూన్ 6న విడుదల చేస్తారన్నారు. పూర్తి సమాచారం కోసం 18004258599 టోల్‌ఫ్రీ నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు రూ.40.73 కోట్ల రుణాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ.40.73 కోట్లు సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు ఈడీ కే.తులసీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి, రవాణా, వ్యవసాయం, తదితర రంగాల ద్వారా ఉపాధి పొందేందుకు 973 మందికి లబ్ధి చేకూర్చే విదంగా రూపొందించిన వార్షిక ప్రణాళికతో జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారన్నారు. అర్హులైన వారు మే 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రూ.3 లక్షల వరకు రుణాలను 176 మందికి, రూ.3 లక్షలకు పైబడిన రుణాలు 493 మందికి అందిస్తామన్నారు. రూ.10 లక్షలకు పైగా విలువ చేసే ఒక యూనిట్ (ఈవీ బ్యాటరీ చార్జింగ్ యూనిట్) మాత్రమే ఉందని, ఇందుకు సబ్సిడీ 40 శాతం, బ్యాంకు లోనూ 55 శాతం పోనూ, లబ్ధిదారుని వాటా 5 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రవాణా హెక్టారులో జిల్లాకు 294 యూనిట్లను కేటాయించడం జరిగిందని, ఇందులో 3 లక్షల నుంచి 10 లక్షల వరకు విలువ చేసే వాహనాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. అయితే ఐదుగురు సభ్యులుగా ఉన్న గ్రూపులకు రుణాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ యూనిట్లు మొత్తం 9 ఉన్నట్లు ఈడీ కే.తులసీదేవి వివరించారు.

పచ్చచొక్కా వేసుకోండి..!

- టీడీపీకి కొమ్ముకాస్తున్న పోలీసులు
- ఫోర్త్ టౌన్ సీఐపై మాజీ ఎమ్మెల్యే కాటసాని ఫైర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'పోలీసులు దిగజారుడు ఉద్యోగాలు చేస్తూ టీడీపీకి కొమ్ముకాస్తున్నారని, కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ పచ్చ చొక్కా వేసుకుంటే మంచిది..' అని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం కర్నూలు నగరంలోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కాటసాని పోలీసులపై విరుచుకు పడ్డారు. సీఐ మధుసూదన్ గౌడ్ పేరు చెప్పకుండానే నాలుగో పట్టణ పోలీసులు టీడీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారంటూ విమర్శించారు. సీఐ పచ్చచొక్కా వేసుకుంటే బెటర్ అంటూ ఎద్దేవ చేశారు. పోలీసులు టీడీపీ నాయకులతో ఒకలా, వైసీపీ నాయకులతో మరోలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఎప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండదని అదిగుర్తు పెట్టుకుని పోలీసులు ఉద్యోగాలు చేయాలని హితవు పలికారు. వైసీపీ క్యాడర్‌పై టీడీపీ నాయకులు దౌర్జన్యాలు చేసిన సందర్భాల్లో పోలీసులు కనీసం కేసుకూడా తీసుకోవడం లేదని ఆరోపించారు. టీడీపీ ఎంపీ శబరి తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. జగన్నాథగట్టుపై కబ్జా చేశానని ఆరోపించారని, చేతనైతే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. వైన్‌షాపులను బార్లుగా మార్చి విక్రయాలు చేస్తున్నా, గ్రామాల్లో బెల్టుషాపులు మీకు కనపడలేదా? అని ప్రశ్నించారు. చేతనైతే ఎక్సైజ్ అధికారులను తీసుకెళ్లి బెల్టుషాపులపై దాడులు చేయించాలని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పాణ్యం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరుకల్లు తండాలో బయటపడ్డ రేషన్ బియ్యాన్ని గురువారం నంద్యాల సివిల్ సప్లయీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయీస్ డీటీ ప్రసాద్ ఆధ్వర్యంలో 206 పాకెట్లతో పాటు మరో 16 పాకెట్లను స్వాధీనం చేసుకుని నంద్యాల సీఎస్ గోడౌన్‌కు తరలించారు. తమ్మ రాజుపల్లె సమీపంలోని ఎస్‌టర్నింగ్ వద్ద ఉన్న గోడౌన్‌లో బియ్యం రాశులుగా ఉండడంతో తూకం వేయడానికి కొంత సమయం పడు తుందని, శుక్రవారం పూర్తి వివరాలు తెలుస్తాయని డీటీ తెలిపారు. తమ్మరాజుపల్లెలో దాదాపు వెయ్యి పాకెట్ల బియ్యం ఉంటాయని అభిప్రాయపడ్డారు. గోడౌన్‌లో నిల్వ ఉంచిన అక్రమార్కులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, ఆర్ఐ రాము, వీఆర్వో బీరేంద్ర, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇద్దరి అరెస్టు

నంద్యాల క్రైం/టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌లో ఇద్దరు నిందితులను అరెస్టుచేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు, ఏఎస్పీ మందా జావళి సూచనలతో గురువారం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మద్దిలేరు వాగు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నంద్యాల పట్టణం హరిజనపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు నాటుసారాతోపాటు కత్తులు కలిగి ఉండటంతో అరెస్టు చేసినట్లు చెప్పారు. హరిజనవాడకు చెందిన కొమ్ముపాలెం బద్రి అలియాస్ బ్రహ్మయ్య, నందమూరినగర్‌కు చెందిన ఇమ్మానియేల్ అలియాస్ పొట్టి ఒక్కొక్కరివద్ద 10లీటర్ల సారాతో పాటు పెద్ద కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కొన్ని పాతకేసులు కూడా ఉన్నాయన్నారు. వన్‌టౌన్ సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపైన, నేరచరిత్రగలవారిపైన వారి కదలికలపైన నిఘావేసి ఉంచామన్నారు.

యూనియన్ బ్యాంక్‌కు వడ్డింపు



- బీమా పరిహారం, ఖర్చులు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు లీగల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల నుంచి బీమా ప్రీమియం వసూళ్లు చేసి ఆ తర్వాత ఆయన మృతి చెందిన తర్వాత బీమా మొత్తం చెల్లించకుండా సేవాలోపం చేసిన కోవెలకుంట్లలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. కోవెలకుంట్లకు చెందిన పువ్వాడి రామసుబ్బయ్య కోవెలకుంట్లలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఒక ఖాతాను తెరిచారు. బ్యాంకు అధికారులు ప్రతి ఏడాది ఖాతాదారుడి నుంచి అభయ గోల్డ్ బీమా పథకానికి ప్రీమియం వసూలు చేసేవారు. ఆ తర్వాత రామసుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుమారుడు నామీని అయిన పువ్వాడి సురేష్ అబయగోల్డ్ బీమా మొత్తం రూ.1.50 లక్షల కోసం బ్యాంకుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. మృతుడి వయస్సు 70ఏళ్లు కావడంతో పాలసీ అతనికి వర్తించదని బ్యాంకు అధికారులు ఫిర్యాది దరఖాస్తును తిరస్కరించారు. దీంతో ఆయన బ్యాంకుతో పాటు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో పాలసీ నిబంధనల మేరకు ఖాతాదారుడు 75 సంవత్సరాల వరకు ఈ బీమా వర్తిస్తుందనే నిబంధనలను వినియోగదారుల కమిషన్ గుర్తించింది. దీంతో ఫిర్యాది చేసుకున్న క్లెయిమ్‌ను బ్యాంకు అధికారులు తిరస్కరించడం సేవాలోపం అవుతుందని నిర్ధారించింది. ఈ మేరకు బ్యాంకు అధికారులు ఫిర్యాదికి బీమా రూ.1.50 లక్షలను 9 శాతం వడ్డీతో పాటు మానసిక ఆవేద నకు గురి చేసినందుకు, కోర్టు ఖర్చుల కింద మరో రూ.15 వేలు చెల్లించాలని ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్ కుమార్, మహిళా సభ్యురాలు నజీమా కౌసర్లు గురువారం ఆదేశాలు జారీ చేశారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకటరాముడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నంద్యాల ఆర్టీసీ బస్టాండులోని స్టాళ్ల నిర్వాహకులు ప్రయాణికులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఈనెల 11వ తేదిన 'అడ్డగోలు దోపిడీ' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకటరాముడు, తూనిక కొలతల అధికారి అనిత, ఆర్టీసీ అధికారులు ఆర్ఎం రజీయా సుల్తానా గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో స్టాళ్లను తనిఖీ చేశారు. అనంతరం నిర్వాహకులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రయాణికులకు మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, అలాగే ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. ఎక్కువ ధరకు విక్రయించినా, ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించినా వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం గంగాధర్‌రావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఫైర్ ఆఫీసర్ భీముడునాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే మాక్‌డ్రిల్ నిర్వహించి అగ్నిప్రమాదాల బారి నుంచి ఎలా రక్షించు కోవాలో చూపించారు. కరస్పాండెంట్ తాజుద్దీన్, అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

మాన్యం కౌలు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న ఈవో వెంకటరమణ

మిడుతూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి, రామేశ్వర స్వామి ఆలయ భూములను కౌలుకు ఇవ్వడానికి ఆలయాల ఈవో వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం వేలం పాటలు నిర్వహించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 117 ఎకరాల భూమికి రూ.11.12 లక్షలు, రామేశ్వర స్వామి ఆలయానికి చెందిన 51 ఎకరాల భూమికి రూ. 3.37 లక్షల ఆదాయం వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 2.14 లక్షల ఆదాయం పెరిగినట్లు ఈవో తెలిపారు. ఏడాది పాటు కౌలుకు వేలం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, కాతా రామచంద్రారెడ్డి, కాతా రాజశేఖరరెడ్డి, బన్నూరు చంద్రారెడ్డి, ఎండోమెంట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో కేసీ కెనాల్‌ను సంబంధిత అధికారులు ఆక్రమణ చెర విడిపించారు. వైసీపీ హయాంలో ఓ డాక్టర్ తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కేసీ కెనాల్ కాలువను ఆక్రమించి పూడ్చివేశారు. ఈ విషయంపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సైతం గళమెత్తారు. ఎట్టకేలకు కేసీ అధికారులు ఈ ఆక్రమణను తొలిగించి రైతులకు ఇబ్బంది లేకుండా చేశారు

కఠినంగా వ్యవహరిస్తాం: డీఈఈ ప్రతాప్

కేసీని ఆక్రమించే వ్యక్తుల పట్ల కఠనింగా వ్యవహరిస్తాం. చాబోలు గ్రామంలో కేసీని కాపాడేందుకు ఆక్రమణదారుడి నుంచి ఉన్నత స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అయినా రైతుల శ్రేయస్సు దృష్ట్యా కేసీని ఆక్రమణదారుడి నుంచి కాపాడాం.

కేసీ కెనాల్‌కు నీటి సరఫరా నిలిపివేత



కేసీ కాలువ

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌కు అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. రిజర్వాయర్లలో సరిపడా నీటీ నిల్వలు లేని నేపథ్యంతో పాటు భవిష్యత్తులో తాగు నీటి అవసరాల కోసం పొలాలకు నీటి సరఫరాను ఆపివేశారు. కేసీ ఈఈ ప్రతాప్ మాట్లాడుతూ కెనాల్ నీటి సరఫరా నిలిపివేసిన సందర్భంగా కెనాల్ మరమ్మతులు చేపడతామని చెప్పారు.

ప్రతిభ ఉంటే అవకాశాలు పుష్కలం

● సినీ నటుడు బలగం సంజయ్



మహానంది, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిభ ఉంటే అవకాశాలు పుష్కలంగా వస్తాయని నటుడు బలగం సంజయ్ తెలిపారు. గురువారం సాయంత్రం మహానంది ఆలయంలో నటుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. తనకు బలగం సినిమాతో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. అందుకే తనను బలగం సంజయ్ అంటున్నారని చెప్పారు. ప్రస్తుతం తాను సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న సంబరాల ఏటీగట్టుతో పాటు వైజయంతీ మూవీస్ బ్యానర్ నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటిస్తున్న చాంపియన్, అఖిల్ హీరోగా నటిస్తున్న సినిమాతో పాటు గోపిచంద్ హీరోగా తమిళ దర్శకుడు చిత్రాల్లో ప్రాధాన్యత గల పాత్రలను పోషిస్తున్నట్లు చెప్పారు. అలాగే మలయాళంలో మోహన్‌లాల్ హీరోగా నటించే వృషభ పాన్ ఇండియా చిత్రంలో నటిస్తున్నట్లు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి: కలెక్టర్



పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో స్పెషల్ ఆఫీసర్లు, ఐసీడీఎస్ అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21లోపు బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గత ప్రభుత్వంలో జీవో 117ప్రకారం పాఠశాలల సర్దుబాటుతో కొంతమంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరారని, ఈ విద్యాసంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆ జీవోకు సవరణ చేయడం జరిగిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారు. 1వ తరగతిలో చేరాలనుకున్న అంగన్‌వాడీ పిల్లలను గుర్తించాలని, ఈ నెల 8నుంచి 22వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ ఉత్సవాలు ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నామని చెప్పారు. ఆవరణలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార సందర్శనశాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ రామునాయక్, ఆత్మకూరు ఆర్డీవో అరుణజ్యోతి, డీఈవో జనార్దన్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పనితీరు ఆధారంగానే పదవులు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పనితీరు ఆధారంగానే పదవులు వస్తాయని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో గురువారం టీడీపీ శ్రీశైలం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలు అండగా ఉంటూ వస్తున్నారని అన్నారు. గ్రామ స్థాయి నుంచే కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో వివిధ కమిటీల్లో బాధ్యతగా పనిచేసిన వ్యక్తులను యథావిధిగా కొనసాగిస్తామని, పనితీరు సరిగ్గా లేనివారిని తొలగిస్తామని చెప్పారు. శ్రీశైలం నుంచి మహానంది వరకు టెంపుల్ టూరిజం కారిడార్ కింద యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అర్హులందరికీ పథకాలు అందజేస్తామన్నారు. రబీ సీజన్‌లో ప్రణాళికబద్ధంగా వ్యవహరించి తెలుగుగంగ, కేసీ కెనాల్, సిద్ధాపురం ఎత్తిపోతల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. ఐదేళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి జైలుకు వెళ్లక తప్పదని అన్నారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు సుబ్బారావు, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, టీడీపీ వివిధ మండలాల అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, శేషిరెడ్డి, నరసింహారెడ్డి, మధు, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, నాయకులు రాజారెడ్డి, షాబుద్దీన్, పస్పీల్ మున్నా తదితరులు ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

నంద్యాల క్రైం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతపై నంద్యాల శక్తిటీం పోలీస్ బృందం నంద్యాలలోని పలు విద్యాసంస్థల్లో శక్తియాప్, పోక్సో చట్టం, మహిళల అత్యవసర నెంబర్లపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని, అత్యవసర సమయంలో ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్ స్టేషన్‌కు చేరి వెంటనే పోలీసులు అక్కడికి చేరి రక్షణగా నిలుస్తారని చెప్పారు. ప్రతి యువతి శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో మహిళా శక్తి టీం తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మకండి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బాలికలు, యువత మోసపూరిత మాటలు నమ్మవద్దని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. గురువారం బండిఆత్మకూరులోని కేజీబీవీలో ఎస్‌వో దాక్షాయిణి నేతృత్వంలో విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ మోసగాళ్ల మాయమాటలు నమ్మి అత్యాసకు వెళ్లి నష్టపోవద్దని, చిన్న వయస్సులో వాహనాలు నడపవద్దని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి మంచి పేరు, ప్రతిష్ఠలు తీసుకువాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మార్కులే జీవితం కాదు'

కొత్తపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆశించిన స్థాయిలో మార్కులు రాలేదని విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దని, మార్కులే జీవితం కాదని జిల్లా జీసీడీవో నాగ సువర్చల సూచించారు. గురువారం కొత్తపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో "పరీక్షలు, మార్కులే జీవితమా..?" విద్యార్థినుల మానసిక స్థిరత్వంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.జీసీడీవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు త్వరలోనే పరీక్షల ఫలితాలు వెలువడే అవకాశం ఉండటంతో మానసికంగా ఎవరూ కుంగిపోకుండా దృఢంగా మనో నిబ్బరంగా ఉండాలని వివరించారు. మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు శ్రీరామ, నాగన్న, సునీత, కేజీబీవీ ప్రిన్సిపాల్ కృష్ణాబాయి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని అలవర్చుకోవాలని జీసీడీఓ నాగసువర్చల పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆత్మకూరులోకి కస్తుర్బాగాంధీ పాఠశాలలో కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలకు సంబంధించి విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు శ్రీరామ్, నాగన్న, సునిత, పాఠశాల ఎస్‌ఓ శ్యామల ఉన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

గడివేముల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలపై, చట్టాలపై, మాదకద్రవ్యాల వల్ల కలిగే పరిమాణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప పరిణామాలను విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



తమ్మడపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మహానంది, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యార్థులు క్రమ శిక్షణతో పాటు సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి తెలిపారు, గురువారం మహానంది మండలం తమ్మడపల్లి గ్రామంలో మహానంది వ్యవసాయ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థుల చేత జాతీయ సేవా పథకం కార్యక్రమాలు కళాశాల డీన్ అధ్యక్షతన ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆమె కళాశాల విద్యార్థుల గురించి ప్రసంగించారు. ఈనెల 23 వరకు తమ్మడపల్లి గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మెదటి రోజు తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాలమ్మ, ఉపసర్పంచ్ ప్రతాపరెడ్డి, కళాశాల శాస్త్రవేత్తలు ఎల్.విజయ భాస్కర్, శ్రీనివాసరెడ్డి, మాధవి,తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

చెంచులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న సంఘమిత్ర సేవా సమితి సభ్యులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన సంఘమిత్ర సేవాసంస్థ దత్తత గ్రామమైన నాగలూటి చెంచుగూడెంలో గురువారం నిరంతర సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాస్, కార్యదర్శి కర్నాటి నాగసుబ్బారెడ్డి, కార్యవర్గ సభ్యుడు ఉసిరికాయల వెంకటరమణయ్య గౌడు, సేవా ప్రముఖ్ శ్రీనివాస్, బాలరాజు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మహా మృత్యుంజయ హోమం

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నంద్యాల పద్మావతీనగర్ లో వెలసిన శ్రీకృష్ణమందిర ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6.30 గంటలకు మహామృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ తెలిపారు. అరిష్టాలన్నీ తొలగి ప్రజా పాలకులు, ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో స్మార్త జ్యోతిష పండితులు యాదవల్లి కార్తికేయ శర్మ ఆచారత్వంలో ఈ హోమాన్ని సంకల్పించారు. కావులన భక్తాదులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని సుధీర్ కోరారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కురుకుంద గ్రామంలోని రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా మొదటిరోజైన గురువారం రామాలయ అనువంశిక ధర్మకర్త కొండ కమలాకరశర్మ పర్యవేక్షణలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా ముందుగా ఆలయంలోని మూల విరాట్టుకు అర్చకుడు శశిధర్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర పూజలను చేపట్టారు. శుక్రవారం హోమపూజలు, సాయంత్రం రథోత్సవం, శనివారం సాయంత్రం పారువేట మహోత్సవం, ఆదివారం గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



నవధాన్యాల కిట్ల తయారీ విధానాన్ని వివరిస్తున్న ట్రైనర్

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ట్రైనర్లు నాగరాజు, మహబూబ్‌బాషా, సయ్యద్‌బాషా రైతులకు సూచించారు. శ్రీపతిరావుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా గురువారం నవధాన్యాల సాగుతో పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలు ఎలా తయారు చేసుకుని, భూసారాన్ని పెంపొందించుకునేందుకు ఎలా వినియోగించాలో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా తృణధాన్యాలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు పచ్చిరొట్టె ఎరువులు తీగజాతి రకాల్లో 30 రకాల విత్తనాలను అన్నింటిని కలిపి ఎకరానికి 8 కేజిల నవధాన్యాల కిట్లను తయారు చేసి రైతులకు వాటి ఉపయోగాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శశికళ, వరలక్ష్మి,అనీష్ బాషా, వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పాములపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జొన్న క్వింటం రూ.3,371 ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు గోనె సంచులు ఇస్తామని, హమాలీ, రవాణ చార్జీలు చెల్లిస్తామని తెలిపారు. రబీలో సాగుచేసిన జొన్న పంటకు ఈకేవైసీ చేయించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని వ్యవసాయశాఖ అధికారులను హెచ్చరించారు. ఎంపీపీ సరోజినీ వర్ధినియా, మార్క్‌ఫెడ్ డీఎం రాజ్, టెక్నికల్ అసిస్టెంట్ ముంతాజ్, ఏవో ఫణీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు హరినాథరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సత్యంరెడ్డి, గోవిందు, నబీరసూల్, మోహన్‌గౌడ్ మల్లికార్జున, ఏసేపు, అలీబాషా, రాము, జలాల్‌బాషా, ఉస్మాన్ పాల్గొన్నారు.

సిబ్బందికి శిక్షణ

పాములపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో వ్యవసాయశాఖ కార్యలయంలో మట్టి నమూన సేకరణపై రైతుసేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఏవో ఫణీశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణ తరగతులకు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత హాజరై మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాలలో సిబ్బంది ప్రతి 15 హెక్టార్లలో మట్టి నమూనాలు సేకరణ కార్యక్రమం మే 15లోపు పూర్తి చేయాలని తెలిపారు.

ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించాలి



మెటీరియల్‌ను విడుదల చేస్తున్న అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పూర్తయిన ప్రతి విద్యార్థి వెంటనే ఎంప్లాయిమెంట్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉద్యోగం పొందాలని ఉపాధి కల్పన అధికారి సోమశివారెడ్డి సూచించారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శశికళ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా ఉపాధి కల్పన అధికారి సోమశివారెడ్డి, సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్, ఎస్వీఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు పోటీ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలి, కావాల్సిన అర్హతలు, అవకాశాలను వివరిస్తూ ముద్రించిన మెటీరియల్‌ను విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పార్వతి, అధ్యాపకులు రమేష్, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారులోని వైఎస్ నగర్‌లో నివాసముంటున్న రామన్నగారి లక్ష్మీదేవి స్కూటీ నిప్పుఅంటించిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తాలుగా సీఐ ఈశ్వరయ్య తెలిపారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు తప్పెట లక్ష్మిదేవి, తప్పెట శివనాగ, తప్పెట నాగేశ్వరావుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల రక్షణకు చర్యలు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే పోలీసుల ధ్యేయమని, చర్యలు తీసుకుంటున్నామని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరాములు అన్నారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు మహిళల భద్రతపై మహిళా పోలీస్ స్టేషన్ సీఐ యజరాములు ఆధ్వర్యంలో మహిళా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తియాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ప్రతి విద్యార్థిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు పోలీస్‌శాఖ పనిచేస్తుందని చెప్పారు. ఆపదలో ఉన్న మహిళలకు శక్తియాప్ ఉపయోగపడుతుందన్నారు. శక్తియాప్, పోక్సో చట్టం, మహిళల అత్యవసర నెంబర్లపై విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి యువతి శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ఎంతో అవసరమని డౌన్‌లోడ్ చేయించారు. మహిళా శక్తి టీం తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత అర్చకుడి మృతి

మహానంది, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో అర్చకుడిగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన బీఎల్ఎన్ లక్ష్మీనరసింహ శాస్త్రి(70) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా దీర్ఘకాల వ్యాధితో బాధపడ్తున్న శాస్త్రి బుధవారం అర్ధరాత్రి మహానంది దేవస్థానం కాలనీలోని ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. గురువారం మహానంది ఆలయ ఏఈవో యర్రమల్ల మధుతో పాటు పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజుతో పాటు వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జునశర్మ, రాఘవశర్మ, జనార్దన్‌శర్మలు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.. అర్చకుడి భార్య భార్గవికి దహన సంస్కారాలకు దేవస్థానం తరుపున రూ. 20 వేలు నగదును అందజేశారు.

హెల్మెట్ ధరించాలి: డీఎస్పీ

పాములపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని డిఎస్పీ రామాంజీనాయక్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని జూటూరు గ్రామంలో స్థానిక ఎస్ఐ సురేశ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో డీఎస్పీతో పాటు సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ వారు మాట్లాడుతూ రహదారి సూత్రాలను ప్రతి వాహనదారుడు పాటించాలని, మద్యం తాగి వాహనం నడుపకూడదని, వాహనాలకు ఇన్సూరెన్సు కల్గి ఉండాలని, అన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్స్, ఓటీపీ విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, మహిళలు ఓంటరిగా వెళ్లేటప్పుడు తమ ఆభరణాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో పోలీసులు గురువారం రాత్రి ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, అర్బన్ సీఐ రాములు నంద్యాల టర్నింగ్‌లో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలను కూడా తనిఖీ చేశారు. అక్రమ రవాణా నేపథ్యంలో పోలీసులు ఆకస్మికంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే పలువురు అనుమానితులను కూడా విచారించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

పాములపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్సీ కార్పొరేషన్ రణాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి 40 శాతం రాయితీతో పాములపాడు మండలానికి 13 యూనిట్లను మంజూరు చేశారని చెప్పారు. ఇందులో 5శాతం డిపాజిట్ చేయాలని, 40 శాతం సబ్సిడీ, 55 శాతం బ్యాంకులు రుణంగా ఇస్తాయని తెలిపారు. 21 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వయస్సు కల్గి ఉండాలని మే 10లోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డా.రామనాథరావు

డోన్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డా.రామనాథ రావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, రికార్డులు హాజరు వివరాలను పరిశీలించారు. క్యాజువాలిటీ, ఎక్స్‌రే విభాగాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు అన్ని మందులను అందుబాటులో ఉంచి అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.హనీఫ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి లక్ష్మన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో నిరుద్యోగ యువత ఉపాధి పొందేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అబ్దుల్ ఆలాంబాషా తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11 నుంచి వచ్చేనెల 10వతేదీ వరకు మీసేవా కేంద్రాల్లో అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్..

శిరివెళ్ల: 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ బ్యాంక్‌లకు 15 యూనిట్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఆదాయ, కులధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఆపత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

శక్తి యాప్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మనమిత్ర శక్తి యాప్‌పై ఇంటింటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జిల్లా బీసీ సెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగి కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ యాప్, శక్తియాప్‌లపై ప్రజలకు తెలియజేశారు. ప్రతిఒక్కరూ ఈ యాప్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు. 8వ వార్డులో ఇంటింటికి వెళ్లి యాప్ గురించి తెలియజేశారు. టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

చాగలమర్రి: కూటమి ప్రభుత్వం చేపట్టిన వాట్సాప్ మనమిత్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ తాహిర్‌హుసేన్ పిలుపునిచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మనమిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఈ కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎంసీవో రాజ్‌కుమార్, మధు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల

చాగలమర్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యం లభిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వీఆర్వోల ఆధ్వర్యంలో పోషణ్ పక్షోత్సవాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వెయ్యి రోజుల ఆరోగ్య సంక్షేమంపై పలు జాగ్రత్తలను వివరించారు. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు.

వైభవంగా సాయి పల్లకోత్సవం

చాగలమర్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినాథ మందిరంలో గల సాయి చిత్రపటాలు, పాదుకలచే పల్లకోత్స వం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేద పండితుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో జల, పాలాభిషేకాలు, సాయివ్రతం, హారతులిచ్చారు. ఆలయ కమిటీసభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వెల్లాల క్షేత్రంలో భూముల వేలం

చాగలమర్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో గురువారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భూములకు వేలం నిర్వహించారు. రాజోలి, వెల్లాల గ్రామ పరిధిలోని 69.10 ఎకరాల భూములకు కౌ లుకు సంబంధించి జరిగిన వేలం పాటలో రూ.5.59 లక్షలకు పాట జరిగినట్లు ఈవో రమణ తెలిపారు. సంజీవరాయ, చెన్నకేశవ, భీమలింగేశ్వర ఆలయాలకు సంబం ధించి భక్తులు ఇచ్చిన పులగం బియ్యం వేలానికి రూ.29 వేలం పాడినట్లు తెలిపారు. ఆలయ ఉద్యోగి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల సీఎస్ఐ చర్చిల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని ఉయ్యాలవాడ పాస్టర్స్ ఛైర్మన్ జోషిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యేసు ప్రభువు శిలువ మరణంపై ప్రజలకు వివరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్రైస్తవులు ఉపవాసంతో ప్రార్థనలు చేస్తారన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి జరిమానా

రుద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తలూరుకి చెందిన పుల్లయ్య అనే వ్యక్తికి డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.10వేలు జరిమానా గురువారం ఆళ్లగడ్డ జెఎంఎఫ్‌సీ జడ్జి విధించినట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడపడం నేరమన్నారు.

డెంగీ, మలేరియాపై అప్రమతంగా ఉండాలి

ప్యాపిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధులపై అప్రమతంగా ఉండాలని రాష్ట్ర వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదకరమైన వ్యాధులు దోమల వ్యాప్తితో వస్తాయన్నారు. వీటి నిర్మూలనకు పంచాయతీ అధికారులతో కలసి పనిచేయాలన్నారు.

పొగాకు దగ్ధం

బనగానపల్లె, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన ఓకౌలు రైతుకు చెందిన పొగాకు బేళ్లు దగ్ధమయ్యాయి. ఆకుమళ్ల రాజన్న ఐదెకరాలు కౌలుకు తీసుకొని పొగాకు పంట వేశారు. పొగాకు పంట వేసి పొలం వద్ద పొగాకును ఆరబెట్టారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు పొగాకుకు నిప్పటించడంతో కాలి బూడిదయినట్లు బాధిత రైతు రాజన్న తెలిపారు. సుమారు రూ.8లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎవరికి వారే సమీక్షలు

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సీసీలు

- సమయపాలన పాటించని వైనం
- ఎడమొహం పెడముఖంగా సీసీలు
- సంక్షేమ పథకాలు అమలు ఎలా..?


రుద్రవరంలోని వెలుగు కార్యాలయం

రుద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అదో ప్రభుత్వ కార్యాలయం. మహిళలకు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వెలుగు కార్యాలయంగా పేరు ప్రకటింపజేశారు. పొదుపు మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై, ఇతర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి పల్లెల్లో మహిళలను చైతన్యం చేసేందుకు పొదుపు మహిళలే కీలకం. వెలుగు కార్యాలయంలో ఎవరికి వారే సమీక్షలు నిర్వహించడం విమర్శలు ఎదురవుతున్నాయి. రుద్రవరం మండలంలో 1,156 పొదుపు సంఘాలు, 1,268 మంది సభ్యులు, 46 వీవోఏ సంఘాలు ఉన్నాయి. ఇక్కడ ఐదుగురు సీసీలు పనిచేస్తున్నారు. ఎడముఖం పెడముఖంగానే ఉంటూ వస్తున్నారు. ఎవరికి వారే సమీక్షలు నిర్వహిస్తారు. వారు అనుకున్న సమయానికే కార్యాలయం చేరుకుంటారు. ప్రభుత్వం ప్రకటించిన సమయపాలన ఉదయం10 నుంచి 5గంటల వరకు పాటించాల్సి ఉంది. వారు వచ్చిందే సమయం, వెళ్లిందే సమయం అన్నట్లుగా సమయాభావం పాటించడంలేదని విమర్శలు ఉన్నాయి. ఇటీవల కార్యాలయంలో సమీక్షలు ఎవరికి వారే నిర్వహించడం ఇందుకు ఉదాహరణ. ప్రభుత్వ కార్యాలయంలో సమన్వయంగా పనిచేయాల్సి ఉంది. సమన్వయం లేనప్పుడు సంక్షేమ పథకాలు పొదుపు మహిళల నుంచి ప్రజలకు చేరేదెలా అన్న విమర్శలున్నాయి.

అందరికీ సమాచారం ఇస్తున్నాం

ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం సీసీ లందరికీ పంపిస్తున్నాం, ఉన్నతాధికారులకు నివేదికలు పంపేందుకు సీసీల నుంచి వివరాలు సేకరిస్తున్నాం. సమీక్షలు సంఘాల వారీగా నిర్వహిస్తూ వచ్చాం. ఎవరికి వారు ఉండడం వాస్తవమేనన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిపాలన సౌలభ్యం కోసం ఇన్‌చార్జ్ ఏపీయంగా కొనసాగుతున్నా.

జయపాల్, ఇన్‌చార్జ్ ఏపీయం, వెలుగు

రాచెర్ల ఎస్‌ఐగా రమేష్‌బాబు

ప్యాపిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల ఎస్‌ఐగా రమేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మణరావు అనంతపురానికి బదిలీ అయ్యారు. కర్నూలు 1టౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ రమేష్‌బాబును ఇక్కడ నియమించారు.

పట్టు తప్పితే అంతే..


ఆటోలో వెనుక కూర్చొని ప్రయాణం

చాగలమర్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కొంత మంది ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొందరు ఆటోలో నిల్చొని, మరి కొంత మంది వెనుక వల్చని ఇనుప రేకుపై కూర్చొని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏ మాత్రం పట్టు తప్పినా ప్రాణాలు కోల్పోవాల్సిందే. చాగల మర్రి జాతీయ రహదారి, పలు గ్రామాల్లో ఇలాంటి ప్రయాణాలు నిత్య కృత్యం.

కమణీయం.. చెన్నకేశవస్వామి రథోత్సవం

బేతంచెర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరిపేటలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి తిరునాళ్లను కన్నులపండువగా నిర్వహించారు. గురువారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవ కార్యక్రమం ఆలయ ఈవో మద్దిలేటిస్వామి సమక్షంలో బ్రాహ్మణ సంఘం నాయకులు, కార్యకర్తలు శ్రీవారి రథోత్సవ కార్యక్రమాన్ని మేళతాళాల మధ్య గోవింద నామస్మరణతో కొనసాగింది. ఈ రథోత్సవం దేవాలయం నుంచి గౌరిపేట, మంగళ బజార్, ఉప్పునీళ్ల బావి, కూరగాయల మార్కెట్ మీదుగా చెన్నకేశవస్వామి ఆలయం వరకు సాగింది. ఈవీ సుజాతశర్మ, ఈవీ మారుతిశర్మ, కృష్ణారావు, అన్నారావు, అజయ్ శర్మ, శ్రీధర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, గౌరి హుశేన్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దళిత బంధువు సీఎం చంద్రబాబు


డోన్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

డోన్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దళిత బంధువు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపిన సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో దళితుల అభివృద్ధికి ఆనాటి ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. టీడీపీ నాయకులు భూమా నాగన్న, వలసల బాలుడు, మిద్దెపల్లి గోవిందు, రవి జనసేన నాయకుడు బ్రహ్మం, బీజేపీ నాయకులు మహారాజ్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదంపై హర్షం

బనగానపల్లె: ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమని నియోజకవర్గం తెలుగుయువత అధికార ప్రతినిధి మందా విజయ్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన ఏకసభ్య కమిషన్‌ను కూటమి ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. ఆయన 13జిల్లాలో పర్యటించి ఆయా వర్గాల అభిప్రాయాలను స్వీకరించి 2025 మార్చి10న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానందుకు నివేదిక అందించారన్నారు. ఆనివేదిక ప్రకారం వర్గీకరణ సాధ్యమైందన్నారు. వర్గీకరణను అమలు చేసిన కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శివనారాయణ, జయరాముడు, దస్తగిరి మాదిగ పాల్గొన్నారు.

సీహెచ్‌వోల నిరసన


రంగాపురం పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

డోన్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీహెచ్‌వోలు గురువారం నిరసన వ్యక్తంచేశారు. రెండేళ్లుగా వేతనాల విషయంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ వారు ఈనిరసన చేపట్టారు. వైద్యఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం కింద పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ చెన్నకేశవులకు వినతిపత్రం అందజేశారు. సీహెచ్‌వోలు శివకృష్ణ, సుమలత, మల్లేశ్వరి పాల్గొన్నారు.

తక్షణమే మంజూరు చేయాలి

బేతంచెర్ల: వైద్యసిబ్బంది రెండేళ్లుగా జీతభత్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుందని, తక్షణమే మంజూరు చేయాలని సీహెచ్‌వోలు భాస్కర్, శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీ ఎదుట వైద్యసిబ్బంది నిరసన తెలిపారు. జీతభత్యాలు లేక కుటుంబ భారం మోయలేక ఇబ్బందులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్ఎస్ రంగాపురం సీహెచ్‌వో ఆచారి పాల్గొన్నారు.


నిధుల దుర్వినియోగంపై విచారణ

- నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం: శ్రీభవాని వర్మ


విచారణ జరుపుతున్న చీఫ్ విజిలెన్సు అధికారి శ్రీభవాని వర్మ

బనగానపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీ ప్రభుత్వంలో భారీ ఎత్తున జరిగిన అవినీతిపై విజయవాడ చీఫ్ విజిలెన్సు అధికారి శ్రీభవాని వర్మ ఆధ్వర్యంలో గురువారం విచారణ నిర్వహించారు. వైసీపీ హయాంలో ఒకే కుటుం బంలో పలువురికి జాబ్‌కార్డులు ఇచ్చి ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు దుర్వినియోగం చేశారు. ఉపాధి పనులకు పోకుండానే పోయినట్లు జాబ్‌కార్డులు మంజూరు చేసి రికార్డుల్లో తప్పుడుగా రాసి భారీగా ఉపాధి నిధులు దారి మళ్లించి లక్షల ప్రజాధనం దారిమళ్లించినట్లు ఆరోపణలు రావడంతో దానిపై విత్ ఎవిడెన్సుతో విజిలెన్సు అధికారులు వివరాలు సేకరించారు. పసుపుల, పెద్దరాజు పాలెం, చిన్నరాజుపాలెం, క్రిష్ణగిరి, చెర్లోకొత్తూరు, పాతపాడు, మీరాపురం, తదితర గ్రామాల్లో ఈకేసులు ఉండడంతో వీటి వివరాలను విజిలెన్సు అధికారులు సేకరించారు. నకిలీ జాబ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఉపాధి పనులకు పోకుండా పోయినట్లు చూయించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. చిన్నరాజుపాలెంలో రామాంజనేయులు అను వ్యక్తి సెరికల్చర్ షెడ్ నిర్మించినా రాజకీయ కక్షలతో షెడ్‌కు బిల్లులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారుడు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించినా బిల్లులు మంజూరు చేయకపోవడంతో లబ్దిదారుడు కోర్టు ధిక్కరణ కేసు వేశారు. దానిపై కూడా సెరికల్చర్, ఇతర ఎన్ఆర్ ఈజీఎస్ అధికారులను విజిలెన్సు అధికారులు విచారించారు. ఎన్ఆర్‌ఈజీఎస్‌కు సంబంధించి చెర్లో కొత్తూరు గ్రామంలో సుమారు రూ.11.50 లక్షలు నిధులు దుర్వినియోగానికి కారకుడైన సస్పెండ్ అయిన టెక్నికల్ అసిస్టెంట్ రాంభూపాల్‌రెడ్డిని పూర్తిస్థాయిలో విచారించి వివరాలు సేకరించారు. కంప్యూటర్ ఆపరేటర్‌పై ఆరోపణలు రావడంతో పూర్తి స్థాయిలో విచారణ గావించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించ నున్నట్లు చీఫ్ విజిలెన్సు అధికారి శ్రీభవాని వర్మ తెలిపారు. డీఎల్‌డీవో నరసింహారెడ్డి, జిల్లా విజిలెన్సు విభాగం అధికారి అన్వరాబేగం, ఎంపీడీవో రమణ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయటమే ప్రభుత్వ ఉద్యో గుల లక్ష్యమని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రకృతి విపత్తు సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రోడ్ల, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందుగానే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వరదల సమయంలో ముందుగానే విపత్తును గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, పశువైద్యురాలు శైలజ పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల నివారణపై..

చాగలమర్రి: ప్రకృతి వైపరీత్యాల నివారణపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్వో లతో ముగింపు శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ వరదలు, అకాల వర్షాలు, అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో అనూరాధ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

శిరివెళ్ల: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పుష్పకుమారి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి వివరించారు. ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, వ్యవసాయాధికారి సుధాకర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా

డోన్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంషాద్‌బేగం, అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా, మున్సిపల్ కమిషనర్ కలిసి బాల్యవివాహాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనపై సమన్వయంతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. వేసవిలో బాల్యవివాహాలు ఎక్కువగా జరిగే అవకాశముందని, అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం


అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

రుద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని య ల్లావత్తులలో గురు వారం వైభవంగా నూతన విగ్రహాలను మేళ తాళాలతో ట్రాక్టర్లపై గ్రామోత్సవం నిర్వహిం చారు. పోలేరమ్మ, పుట్టాలమ్మ పెద్దమ్మ అమ్మవార్ల విగ్రహాలు లక్ష్మీనరసింహస్వామి, చెన్నకేశవ, నాగలింగేశ్వరస్వామి విగ్రహాల గ్రామోత్సవం కొనసాగింది. ఇంటింటి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. వేద మంత్రోచ్చారణల మధ్య వేదపండితులు పుణ్యాహవాచనం, పంచగవ్య, రుత్విగ్వరణం, రక్షాబంధనం, నవగ్రహ, వాస్తు ప్రధాన, కలశ స్థాపన, ఆరాధన, మహానైవేద్యం దాక్షాహోమం, జలాధివాసం, అంకురార్పణ పూజలు చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రుద్రవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం రేంజ్ పరిధిలో వృక్ష సంపద సంరక్షణలో నిర్లక్ష్యం తగదని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. గురువారం రేంజ్‌లోని బోరింగ్, ఊట్ల బేస్‌క్యాంపులను సందర్శించారు. ప్రొటెక్షన్ వాచర్లను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమాచారం అందించాల న్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసరు మక్తర్‌బాషా, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సోమేశ్వరరావు


సోమేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

డోన్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పోరాట యోధుడు సోమేశ్వరరావు అని డోన్ పెన్షనర్ల సర్వీసు సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ భానుసింగ్ అన్నారు. గురువారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో గుంటూరు జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులుగా పనిచేసి పెన్షనర్ల సమస్యలపై పోరాడిన సోమేశ్వరరావు 5వ వర్ధంతని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్ల సంఘం నాయకులు సుబ్బరాయుడు, దానప్ప, గోపాల్, రామదాస్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, చెన్నకేశవులు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలను నివారించొచ్చని డోన్ అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామి గౌడు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వెంకటేశ్వర ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విద్యార్థులకు గురువారం అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది రంగస్వామి, ప్రభాకర్, రాజశేఖర్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి) : స్థానికంగా పలు కాలనీల్లో నూతనంగా వీధిలైట్లు ఏర్పాటు చేశారు. గురువారం పంచాయతీ స ర్పంచ్ జినుగు శివరాముడు ఆధ్వ ర్యంలో నాయినిపల్లె రహదారిలోని కాలనీ, దర్గా కాలనీ తదితర ప్రాం తాల్లో వీధిలైట్లు ఏర్పాటుచేశారు. రాత్రి సమయంలో చీకట్లు అలము కొని ఇబ్బందులు పడుతున్నామన్న కాలనీవాసుల విజ్ఞప్తిమేరకు లైట్లు ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలి పారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

బేతంచెర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. వేసవికాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకూడదని గతంల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశాల్లో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆదేశాల ఇచ్చారన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. కొందరు సామాజిక మాధ్యమాల్లో తమ సొంత నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు అసత్యాలు ప్రచారం చేసుకుంటున్నారనీ, మరి కొందరు సమస్య పరిష్కారమైన తర్వాత ఆసమస్యను తామే పరిష్కరించినట్లు అవాస్తవాలు ప్రజలకు చెబుతున్నారన్నారు. ప్రతి అభివృద్ధి పని వెనుక ప్రభుత్వ నిధులున్నాయని, ఎవరూ కూడా స్వంత నిధులతో సమస్యను పరిష్కంచడంలేదని తెలిపారు.

కోవెలకుంట్లలో మహాకుంభాభిషేకం


ఆహ్వాన పత్రిక అందుకుంటున్న టంగుటూరు శ్రీనయ్య

బనగానపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి దేవస్థానంలో వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న కుంభాభిషేకానికి హాజరు కావాలని టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్యను నిర్వాహకులు గురువారం ఆహ్వానించారు. కోవెలకుంట్ల ఆర్యవైశ్యం సంఘం నాయకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల మండి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇస్కాలప్రసాద్, ఉపాధ్యక్షుడు పెండేకంటి నాగరాజు, కాల్వ శివనాగయ్య, పెండేకంటి సన్నీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే దాకా నిరసనలు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే దాకా నిరసనలు కొనసాగిస్తామని మజ్దూర్ యూనియన్ కా ర్యదర్శి రాజశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. రీజనల్ ఛైర్మన్ ఎన్‌కే రావు, అధ్యక్షుడు పివి రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, గ్యారె జ్ కార్యదర్శి రమణ, సభ్యులు ప్రసాద్, జనార్ధన్, రమణ, రసూల్, సుబ్బా రావు, రోషయ్య గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

- హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలానికి కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం రానున్నారు. ఉదయం ఓర్వకల్లు మండలంలోని పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టును మంత్రి సందర్శించిన అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు అహోబిలం క్షేత్రానికి చేరుకొని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. మంత్రి రాక సందర్భంగా అహోబిలం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హెలిప్యాడ్, భద్రత ఏర్పాట్లను ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు.